క్లుప్తంగా

అమ్మవారికి పూజలు



రేణుక ఎల్లమ్మ అమ్మవారు

తాండూరు రూరల్: అమావాస్య సందర్భంగా మండల పరిధి కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మను పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు కుటుంబ సభ్యులు ఒడిబియ్యం పోశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి సన్నిధికి సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక, జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: క్రిస్మస్ పండుగ సందర్భంగా.. సామాజిక, విద్యావైద్యం, సాహిత్యం, కళా, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ చూపిన క్రైస్తవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు, వ్యవస్థలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సత్కరించి, తగిన గుర్తింపు ఇవ్వనుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలకు పైబడిన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని తెలిపారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కార్పొరేషన్ హైదరాబాద్ కార్యాలయాన్ని సంప్రదించి వ్యక్తిగతంగా పొందవచ్చునని సూచించారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. నామినేషన్ పత్రాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 13 నుంచి 15 తేదీ లోపు సమర్పించాలని వివరించారు. మరిన్ని వివరాల కొరకు 040 2339106 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



పిచ్చిమొక్కల మధ్య మరుగుదొడ్లు

నవాబుపేట: ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వలన మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లోపం వలన శిథిలావస్థకు చేరువవుతున్నా.. సంస్థ అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణ మధ్యలో ఎవరికి ఏ అత్యవసరమొచ్చినా ఏం చేయాలో పాలుపోని దుస్థితి. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులు సమయానికి నడపండి..

తాండూరు రూరల్: ఆర్టీసీ బస్సుల రాకపోకల్లో సమయపాలన పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. మంగళవారం మండల పరిధి జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ వద్ద వారు మాట్లాడారు. పాఠశాలలు వదిలే సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో తమ పిల్లలు ఇంటికి వచ్చేసరికి రాత్రి అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా సమయపాలన లేకపోవటం వలన పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని మండిపడ్డారు. విద్యాలయాలు ప్రారంభం, ముగింపు వేళల్లో సర్వీసులు తిరిగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

మొయినాబాద్‌రూరల్: ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ కిషన్‌జీ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై ఎస్ఐ కిషన్‌జీతో పాటు ఏఎస్ఐ శివారెడ్డి, సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని వారికి ఛలాన్లు వేశారు. అనంతరం ఎస్ఐ కిషన్‌జీ మాట్లాడారు. ప్రమాదాలను నివారించాలంటే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు.



కుటుంబ సభ్యులతో మంగళవారం శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి
- అనంతగిరి

విద్యాప్రమాణాలకు 'తొలిమెట్టు'

- విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి
- సర్కారు బడులపై ప్రజలకు నమ్మకం కలిగించాలి
- సమీక్షలో ఎంఈఓలు చంద్రప్ప, హరిశ్చందర్



పూడూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

బంట్వారం: ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలంటే 'తొలిమెట్టు'ను విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. మంగళవారం కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడారు. తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండటంతో పాటు, సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల డ్రాపౌట్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. శాఖా పరమైన చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఎస్ఓ మస్తారామ్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు తప్పనిసరి

పూడూరు: విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. మండల పరిధి మన్నేగుడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగేలా నాణ్యమైన విద్యను అందించాలని, సర్కారు బడుల్లో చదివేలా ప్రోత్సాహించాలని చెప్పారు. విద్యార్థులకు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. టీఎల్ఎం శిక్షణపై ప్రతి ఒక్కరు అవగాహనతో ఉండాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎంలు రత్న, స్వరూప, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి

పరిగి: నాణ్యమైన విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని జూనియర్ కళాశాలల జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో అందుకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యాలయాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా.. వెంటనే అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకుడు భాస్కరయోగి తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల గుర్తింపు షురూ

- గ్రామాల్లో సర్వే ప్రారంభం
- ప్రబంధ్ పోర్టల్‌లో వివరాల నమోదు



బాలంపేటలో సర్వే చేస్తున్న సీఆర్‌పీలు

దౌల్తాబాద్: ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ప్రారంభమైంది. ఇందులో బడీడు పిల్లలు, చదువు మానేసిన వారు, నిత్యం పాఠశాలకు రాకుండా ఉండే వారిని గుర్తిస్తున్నారు. బడీడు బాల బాలికలు చదువుకు దూరం కాకుండా, అందరూ విద్యనభ్యసించాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయి.

నెల రోజుల పాటు

బడిబయట పిల్లలను గుర్తించే ప్రక్రియ ఏటా జనవరిలో చేపట్టనుండగా.. ప్రస్తుతం డిసెంబరులోనే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నుంచి జనవరి 10 వరకు సర్వే చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికను రూపొందించింది. పాఠశాల స్థాయిలో 6 సంవత్సరాల నుంచి 14వరకు, కళాశాల స్థాయిలో 15సంవత్సరాల నుంచి 19ఏళ్ల వయస్సున్న బాలబాలికలను గుర్తిస్తారు. విద్యాశాఖ పరిధి సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో సంచార జాతుల కుటుంబాలను కలిసి, వారి పిల్లల చదువు వివరాలు సేకరిస్తున్నారు. ఆ వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

అవార్డు రావడం అభినందనీయం

కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ



అవార్డును ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

మొయినాబాద్‌రూరల్: 'ఏఐసిటిఈ ఎడ్యూ స్కిల్స్ కనెక్ట్–2023' దేశంలో 1500లకు పైగా సంస్థలు వివిధ విభాగాల్లో పోటీ పడినప్పటికీ కేఎల్ యూనివర్సిటీకి అవార్డు రావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీకి అవార్డు వచ్చిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవార్డు గురించి వివరించారు. కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ గోవాలో జరిగిన ఏఐసీటీఈ ఎడ్యూ స్కిల్స్ కనెక్ట్–2023 కన్‌క్లేవ్‌లో ప్రత్యేకంగా నిలిచి అవార్డును పొందిందని తెలిపారు. విద్యా, నైపుణ్యాభివృద్ధిలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిందన్నారు. ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య ధ్రువీకరణలు క్యాంపస్‌లోని నిపుణులైన అధ్యాపకుల మార్గదర్శకంలో విద్యార్థులు చేపట్టిన ప్రభావంతమైన ప్రాజెక్టులకు విశ్వవిద్యాలయం సహకారానికి బెస్ట్ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డు కేఎల్ యూనివర్సిటీకి రావడం ఎంతో గర్వంగా ఉందని వెల్లడించారు. ఆల్ ఇండియాలో 3వ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా ఆసియా బుక్ ఆఫ్ రికార్డు నమోదు ద్వారా విశ్వవిద్యాలయం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌గో రిథమ్ పోటీలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం ఆల్‌గో రిథమ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 16 గురుకుల పాఠశాలల నుంచి 263 మంది విద్యార్థులు పాల్గొనగా.. కార్యక్రమాన్ని సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్ శారద, కళారత్న మేఘన శివాని గోగు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గీసిన చిత్రాలు, డ్రాయింగ్, బుక్ రివ్యూ, స్టోరీ టెల్లింగ్ తదితర వాటిని ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని.. విద్యుత్ స్తంభాలు, రెండు 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై సరఫరా నిలిచిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనను మంగళవారం 'సాక్షి' ప్రచురించింది. దీనికి స్పందించిన ట్రాన్స్‌కో ఏడి ఆదినారాయణ ఐదు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. అంతే కాకుండా మండలానికి కేటాయించిన సంస్థ ఏఈ సందీప్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

గ్రామ పంచాయతీగా మార్చాలని వినతి

చేవెళ్ల: ధర్మసాగర్‌ను గ్రామ పంచాయతీగా మార్చాలని కోరుతూ గ్రామస్తులు, నాయకులు చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలలోపు పల్లెను గ్రామపంచాయతీగా మార్చాలని వారు వినతి పత్రంలో కోరారన్నారు. గ్రామ పంచాయతీకి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని ఆర్డీఓతో చెప్పారు. జనాభా పరంగా అర్హత ఉందని పేర్కొన్నారు. ప్రధాన రోడ్డుకు అనుకొని అనుబంధ గ్రామం ఉండటంతో గొల్లపల్లికి వెళ్లటానికి తమకు ఇబ్బందిగా ఉందని వెల్లడించారు. ఇప్పటికే పలు మార్లు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలను అందజేశామని, అధికారులు స్పందిచాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసాగర్ గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కేశంపేట తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులు

తపాలా సంఘం డివిజన్ సెక్రటరీ విక్రమ్‌రెడ్డి

షాద్‌నగర్: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం డివిజన్ సెక్రటరీ విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మొగిలిగిద్ద గ్రామంలోని సబ్ డివిజన్ కార్యాలయ గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాటాడారు. ఉద్యోగుల పని, పరిస్థితులు వేతనాల పరిశీలన కోసం నియమించబడిన కమలేశ్ చంద్ర కమిటీ నివేదికను అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు.. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆసరా పింఛన్ డబ్బులు, ఉపాధి హామీ కూలీలకు డబ్బులను పంపిణీ చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్నా.. తమకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. తపాలా ఉద్యోగులను 4 నుంచి 5గంటలు పని చేస్తున్నట్లుగా పరిగణనలోకి తీసుకోవడం బాధాకరమన్నారు. తమకు పింఛన్‌తో పాటు అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆజీమ్, మహ్మద్ అలీ, వెంకట్‌రెడ్డి, మధుకర్, రాజు, కస్తూరి, మేఘన, అర్జున్ ఉన్నారు.

వ్యవసాయం పండగ

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందండి: పీఏసీఎస్ చైర్మన్



రైతుకు టోకెన్ అందజేస్తున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ధారూరు: వ్యవసాయం దండగ కాదని, రైతుల పాలిట పండగ అని ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ.2,203, బీగ్రేడ్‌కు రూ.2,183గా ధర ఉందని పేర్కొన్నారు. నాగారం, గురుదోట్ల, మోమిన్‌కలాన్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 47,331 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని, సంఘానికి రూ.8 లక్షల లాభం వచ్చిందని ఆయన వెల్లడించారు. నిర్ణీత తేమ శాతం ఉండాలని, దుమ్ముధూళి లేకుండా వడ్లను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, సీఈఓ నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్, గఫార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సంజూరాథోడ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగితే చర్యలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

యాలాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలిగితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడారు. గన్నీ బ్యాగులు, తూకం, బిల్లుల నమోదు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ మునీరుద్దిన్, ఆర్ఐ నారాయణరెడ్డి, డీసీఎంఎస్ ఉద్యోగులు పాండురంగం, శశికళ తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు



దౌల్తాబాద్: విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్: బీసీ బాలుర వసతిగృహం, బాలంపేట కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఔషధాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తుల్జారాం మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫి, ఏఎన్ఎంలు అనిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు టౌన్: జిల్లా వైద్యాధికారుల ఆదేశానుసారం పది రోజులుగా 13 గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఇందిరానగర్ బస్తీ దవాఖాన వైద్యుడు డాక్టర్ హరీశ్ తెలిపారు. మంగళవారం వసతి గృహంలో వైద్య పరీక్షల అనంతరం ఆయన మాట్లాడారు. పిల్లలకు జ్వరం, దగ్గు, చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నాలుగు బృందాలుగా ఏర్పడి.. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు రాధ, అక్షయ్, అతీల్ ఖాన్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజకు ఆహ్వానం



ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్ప సేవా సమితి సభ్యులు

కుల్కచర్ల: అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 18న జరగనున్న అయ్యప్ప మహా పడిపూజకు రావాలని అయ్యప్ప మండల సేవాసమితి సభ్యులు.. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మనోహర్‌రెడ్డిని సమితి తరపున సన్మానించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పట్లోళ్ల వెంకట్రామిరెడ్డి, గురుస్వాములు సతీష్‌కుమార్, ఈశ్వరయ్య, శివకుమార్, గణేశ్, సంగప్ప, వినిత్, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

యాలాల: లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గ్రామం నుంచి పార్టీకి మంచి మెజార్టీ వచ్చిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, బాలప్ప, నర్సప్ప, మాలప్ప, రాజు, యాదప్ప, బలరాంరెడ్డి, అంజిలప్ప, రమేష్, నగేష్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

స్థిరాస్తి రంగం పుంజుకునేనా?

- ఏడాది కాలంగా 'రియల్' డీలా
- అగ్రిమెంట్ల వద్దే ఆగిన కొనుగోళ్లు
- నూతన సర్కారుపై వ్యాపారుల ఆశలు



మోమిన్‌పేటలో ఏర్పాటు చేసిన వెంచర్

మోమిన్‌పేట: కరోనా అనంతరం తెలంగాణలో భూ వ్యాపారం తగ్గుముఖం పట్టింది. వైరస్ సృష్టించిన కల్లోలానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రతిఒక్కరూ బాధితులయ్యారు. ఆర్థికంగా చితికిపోయారు. వెరసి అన్ని రకాలా లావాదేవీలు స్తంభించిపోయాయి. క్రమంగా అన్ని రంగాలు పుంజుకుంటున్నా.. స్థిరాస్తి వ్యాపారం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నన్న చందంగా మిగిలిపోయింది. అంతకు ముందు అనేక మంది ఎన్నో ఆశలతో అప్పులు చేసి, చర, స్థిరాస్తులు తాకట్టుపెట్టి రియల్ బిజినెస్‌లో పెట్టుబడి పెట్టారు. తదనంతరం భూముల క్రయవిక్రయాలు నెమ్మదించడంతో చాలామంది కుదేలయ్యారు. క్రమంగా భూ వ్యాపారం పెరుగుతుందనుకున్న సమయంలో ఉన్నట్టుండి ఏడాది క్రితం డీలా అయింది. చాలా వరకు అగ్రిమెంట్ల వద్దే నిలిచిపోయింది. దీంతో వ్యాపారులు మళ్లీ తలలు పట్టుకున్నారు. పెట్టిన పెట్టుబడికి వడ్డీ కట్టలేని దుస్థితికి చేరారు. వచ్చినకాడికి అమ్ముకుందామనుకున్న కొనడానికి ఎవరూ ముందుకు రావడంలేదు.

వ్యాపారుల కకావికలం

గతంలో మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో 40వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండేవి. ప్రస్తుతం రోజుకు 15దాటడం లేదు. అవి కూడా గుంటల్లోనే జరగడం గమనార్హం. దశాబ్ద కాలం క్రితం వరకు ఎకరా భూమి రూ.లక్షల్లో పలకగా.. గడిచిన కాలంలో భూముల ధరలకు రెక్కలు వచ్చి.. వందల రెట్లు పెరిగాయి. దీన్నే ఆసరాగా తీసుకున్న వ్యాపారులు వందలు, వేల కోట్లల్లో పెట్టుబడులు పెట్టారు. ఏన్కతల గ్రామంలో 1,100 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ కంపెనీ ఏర్పడనుందని ప్రభుత్వం పేర్కొనడంతో భూములు ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఏడాది క్రితం అదే ప్రభుత్వం 111జీఓను ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించడంతో వ్యాపారం దెబ్బతిన్నది. పూర్తి స్థాయిలో జీఓ అమలు కాని పరిస్థితుల్లో.. క్రయవిక్రయాలు ఆగిపోయాయి. వెంచర్లు బోసిపోయాయి. ఉన్నట్టుండి రియల్ డీలా కావడంతో కకావికలం అవుతున్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో వ్యాపారుల్లో ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ సర్కారు తీసుకునే చర్యలతో రియల్ వ్యాపారం భవిష్యత్తు ముడిపడి ఉందని పలువురు పేర్కొంటున్నారు. తిరిగి దందా ఊపందుకుంటేనే అందరికీ అన్నివిధాలా లాభం చేకూరుతుందని వెల్లడిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ధరలు ఉండటంతో పడావుగా ఉన్న భూములను అమ్ముకునేందుకు కొందరు రైతులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా స్థిరాస్తి రంగం గాడిన పడటానికి సర్కారు ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో చూడాలి మరి..